


**ఏ డిపార్టుమెంట్ అయితేనేం, అదో సెక్షన్ ఆఫీసు — చాలా ఆఫీసుల్లో అక్కడా కాగితాలతోటే పని!**

తెల్లారితే పొద్దుగూకేవరకూ తెల్లకాగితాలు నలుపౌతుంటాయి అక్కడ. నల్పుపై నాలుగు చెరగులకీ కదులుతుంటాయి. కరెన్సీ రెపరెపలు ఆ మూమెంట్సుని కంట్రోలు చేస్తూంటాయి.

ఆఫీసు యంత్రాంగానికి ముడిపదార్థమైన తెల్లకాగితాల సప్లై—కథా కమామిషు ప్రస్తుతాంశం!

తొలుత ఒక సెక్షన్ ఆఫీసరు జవానుకి రెండు రూపాయలిచ్చి "ఓ దస్తా తెల్ల కాగితాలు పట్రా. రశీదు మర్చిపోకు" అన్నాడు. సదరు జవాను స్టేషనరీషాపు కెళ్ళి దస్తా ధర అడిగాడు. "రూపాయిన్నర. రెండూ" అంటూ రెండురకాలు చూపించాడు అతగాడికి బుర్రలో మిణుగురు వెలిగింది. రూపాయిన్నర కాగితాలు తీసుకుని. రశీదు రెండు రూపాయలకి తీసుకున్నాడు. మిగిలిన అర్ధ కళ్ళకద్దుకుని జేబులో వేసుకున్నాడు.




ఇలా తెల్ల కాగితాలు తెచ్చినపుడల్లా అతను చాయ్ నీళ్ళకి మిగుల్చుకునేవాడు. సెక్షనాఫీసరు అనుమానమొచ్చి ఓరోజు నాకబుచేశాడు. రంగు తేలింది. "హరి భడవా" అనుకుని అతగాడి తెల్ల కాగితాల బిజినెస్‌లో నిప్పులు పోశాడు. తనే స్వయంగా కొద్ది మార్పులతో కొనుక్కుని బాలెన్సు కళ్ళకద్దుకోసాగాడు.

సరైన రేటుకి దస్తా కాగితాలుకొని ఒకటికి పదిదసాల రశీదు తీసుకోడంతో అతని స్వంత వ్యాపారం మొదలయింది. అలా కతికి కతికి తెల్ల కాగితాల ముసుగులో పచ్చకాగితాలు వెనకేసుకున్నాడు.

అకౌంట్ వెరిఫికేషన్‌లో ఈ కుంభకోణం బెటపడి సబ్ డివిజన్ ఆఫీసర్ కంట్లో పడింది. అతను మరికొంచెం కళ్ళుతెరిచి చూడగా దాదాపు అందరు సెక్షన్ ఆఫీసర్ల వ్యాపకం అదేనని తేలింది. ఆయనేం తక్కువ తినగల్చుకోలేదు.

'ఎంత మోసం' అని కనుబొమలెగరేసి 'వీళ్ళకి తగిన శాస్తి జరగాలి' అనుకుని డివిజనల్ ఆఫీసర్‌కి అతను రిపోర్టు పంపాడు.

'తెల్ల కాగితాలకి చెదపట్టింది. కాబట్టి ఏలినవారు అనుమతిస్తే టెండర్లు పిలిచి నేనె నా సబ్ డివిజన్ అంతా సరఫరా చేసుకోగలను అని.

డివిజనల్ ఆఫీసరుకి ఫ్యూజు కొట్టింది. ఆ ఛాన్సు కింది వాడికి ఎందుకివ్వాలని, ఇలా సర్క్యులర్ పంపాడు:

'ఇందుమూలంగా తెలియవచ్చునదేమనగా మీ రెవ్వరూ కాంపిటెంట్ కాదు. డివిజన్ మొత్తానికి నేనే టెండర్లుపిలిచి.... కాగితం కొనుగోలు. సరఫరా అన్నీ నేనే చెయ్యగలవాడను. మీకు తెల్లకాగితాలు కొనే

**ఔను నిజం!**

చిట్టెలుకలు చాలావరకు ఏడుగజాల వ్యాస పరిధిలోనే జీవిస్తాయట-పుట్టుకనుంచి గిట్టేదాకా.

అధికారాలు రద్దుపర్చడమైనది' అని నోర్మూయించి ఆ పనికి పూనుకున్నాడు.

టెండర్ భాగవతంలో అతనికి పుష్కలంగా కావల్సింది దొరికింది.

ఈ తంతు అంతా జనరల్ మానేజర్ నిస్సహాయంగా చూస్తుండిపోయాడు. అయితే తెల్ల కాగితాల్లో తల దూర్చడం ఆయన స్థాయికి తగ్గపని కాదు అనిపించింది ప్రస్తుతానికి.

అసలు ఉద్యోగం మాని రాజకీయాల్లో చేరిపోయి అధికారపక్షంలో నిలబడి గెలిచి ఆ శాఖకే మంత్రిగా వచ్చి అన్ని అయిటంస్‌తోబాటు తెల్లకాగితాల సప్లైకి సర్వహక్కులూ ఒకానొక బావమర్దికి ధారాదత్తంచేసే ఆలోచన ఆయనకు లేకపోలేదు.

